
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



తాడిపత్రికి బ్రహ్మోత్సవ శోభ
దక్షిణ భారతదేశంలోనే పేరుగాంచిన తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభం కాన్నాయి. 8లో



టమాట కిలో రూ.13
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.7°/ 18.2°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఎండు మిర్చి క్వింటా రూ.25 వేలు



మార్కెట్‌కు వచ్చిన ఎండుమిర్చి

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా ఎండుమిర్చి మంగళవారం గరిష్టంగా రూ.25 వేలు పలికింది. మార్కెట్‌కు 59 క్వింటాళ్ల మిర్చి రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేశారు. క్వింటా గరిష్టంగా రూ.25 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సరాసరిన రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

రేషన్ కార్డుకు కేజీ రాగిపిండి



మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని రేషన్ కార్డుదారులకు మార్చి నెల కోటాలో చౌక బియ్యంతో పాటు రాగిపిండి అందజేస్తామని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. రాగి పిండిలో అత్యంత పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని కార్డుదారులకు రాగి పిండిని అందజేస్తున్నామన్నారు. ప్రతి కార్డు దారునికీ బియ్యంతో పాటు కిలో రాగులు ఉచితంగా ఇస్తామన్నారు. రాగి పిండిని మాత్రం కిలో రూ.11 చొప్పున అందిస్తామన్నారు. ప్రతి రేషన్ డీలర్ ఎండీయూ వాహనాల ద్వారా కేజీ రాగిపిండిని రూ.11 తో అందజేయాలన్నారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

అనంతపురం సిటీ: జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జెడ్పీ సీఈఓ నిదియాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. స్థాయీ సంఘం –1, 2, 3, 4, 5, 6, 7 (ఆర్థిక, ప్రణాళిక/ఇంజినీరింగ్ విభాగాలు/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/స్త్రీ, శిశు సంక్షేమం/ వ్యవసాయం/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సహా ఇతర స్థాయీ సంఘాల చైర్మన్ల అధ్యక్షతన సమావేశాలు సాగుతాయన్నారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించి సమగ్ర వివరాలతో అధికారులు హాజరుకావాలని సీఈఓ ఆదేశించారు.

ఎంటెక్ ఒకటో సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ఎంటెక్ ఒకటో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. వర్సిటీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ఫలితాలను విడుదల చేశారు. ఈ నెల 12న ప్రారంభమైన పరీక్షలు 14వ తేదీన ముగిశాయి. ఈ క్రమంలో కేవలం 13 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం గమనార్హం. ఇందుకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ డి. లలిత కుమారిని ప్రిన్సిపాల్ అభినందించారు.

బతుకు బండికి భరోసా

- ఆటో కార్మికులకు అండగా 'వాహన మిత్ర'
- ఏటా రూ.10 వేల సాయం అందిస్తున్న జగన్ సర్కార్
- లబ్ధిదారుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే అధికం
- జిల్లాలో ఆరు వేల మందికి రూ.24 కోట్లు జమ

ధర్మవరానికి చెందిన శంకర్ ఆటో నడుపుకుని జీవనం సాగించే వాడు. గత ప్రభుత్వ హయాంలో ఆటోకు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ లేదని మోటారు వాహనాల తనిఖీ అధికారులు జరిమానాలు విధిస్తుండటంతో చివరకు ఆటో అమ్మేశాడు. జగన్ ప్రభుత్వం ఆటో కార్మికులకు వాహన మిత్ర ద్వారా ఏటా రూ.10 వేల సాయం చేస్తోందని తెలుసుకొని.. వెంటనే లైసెన్స్ తెచ్చుకుని తిరిగి ఆటో కొనుగోలు చేశాడు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో మొత్తం రూ.40 వేలు అందుకున్నానని ఆనందంగా చెబుతున్నాడు.

హిందూపురానికి చెందిన నాగరాజు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు వాహన మిత్ర పథకం ద్వారా మొత్తం రూ.50 వేల లబ్ధి చేకూరింది. ఈ ప్రభుత్వంలో వాహనమిత్రతో పాటు వివిధ పథకాల ద్వారా నాగరాజు కుటుంబానికి మొత్తం రూ.2.10 లక్షల లబ్ధి చేకూరింది. కార్మికుల సంక్షేమం గురించి ఆలోచించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని, ఆయనకే తమ మద్దతు ఉంటుందని చెబుతున్నాడు.



కదిరి: ఆటో, మ్యాక్సీ క్యాబ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు వైఎస్ జగన్ సర్కార్ అండగా నిలుస్తోంది. 'వైఎస్సార్ వాహన మిత్ర' పథకం ద్వారా ఏటా రూ.10 వేల సాయంతో వారి బతుకు బండికి భరోసా కల్పిస్తోంది. ఇప్పటి వరకూ ఐదు విడతల్లో 5,790 మంది కార్మికుల ఖాతాల్లో రూ 23.70 కోట్లు జమ చేసింది. జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల్లో ఎక్కువ శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గానికి చెందిన వారే ఉన్నారు. ఈ డబ్బుతో వాహనానికి బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, చిన్నపాటి మరమ్మతులకు ఇబ్బందులు లేకుండా పోయాయని ఆటో, ట్యాక్సీ వాలాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా అమలు

'వైఎస్సార్ వాహన మిత్ర' పథకం జిల్లాలో పారదర్శకంగా అమలు చేస్తున్నారు. గత టీడీపీ పాలనలో అర్హత ఉన్నప్పటికీ టీడీపీ నాయకులతో ఏర్పడిన జన్మభూమి కమిటీలు సిఫారసు చేస్తే గానీ సంక్షేమ పథకాలు అందేవి కాదు. కానీ జగన్ సర్కార్... ఏ నాయకుడి సిఫారసు లేకుండానే అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తోంది. వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను గ్రామ లేదా వార్డు వలంటీర్ తొలుత క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. చివరగా రవాణాశాఖ అధికారులు... ఇలా ఆరు దశల్లో పరిశీలించిన మీదట అర్హులను ఎంపిక చేశారు. మొదట్లో ఒకట్రెండు విడతల్లో వాహన మిత్ర డబ్బులు తీసుకున్నప్పటికీ తర్వాత వారి ఆర్థిక పరిస్థితి బాగుందని వెల్లడైనందున అలాంటి వారిని ఈ పథకం లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించారు. దారిద్య్ర రేఖకు దిగువన ఉండి, లైసెన్స్ పొంది ఆటో కలిగిఉన్న అర్హులైన వారికి మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు.

వైఎస్సార్ వాహన మిత్ర పథకం అమలు ఇలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు జమ (రూ.కోట్లలో)
కదిరి	1,483	5.05
ధర్మవరం	1,090	4.25
పుట్టపర్తి	1,130	4.89
హిందూపురం	909	3.70
మడకశిర	267	1.06
పెనుకొండ	722	3.32
రాప్తాడు	314	1.44
సంవత్సరం	అర్హులు	లబ్ధి (రూ.కోట్లలో..)
2019-20	3,033	3.03
2020-21	5,036	5.04
2021-22	4,842	4.84
2022-23	4,999	5.00
2023 -24	5,790	5.79

మాట నిలబెట్టుకున్నారు



పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ ఆటోడ్రైవర్లను ఆదుకుంటామని ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన తర్వాత 'వాహన మిత్ర' ద్వారా నిలబెట్టుకున్నారు. ఏటా చెప్పిన సమయానికి మా బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నారు. జగనన్నను జీవితాంతం గుర్తుంచుకుంటాం. ఆయనకు మా సంపూర్ణ మద్దతు ఉంటుంది.
– చంద్ర, సైదాపురం ఎస్సీ కాలనీ, కదిరి

జగనన్నకు కృతజ్ఞతలు



'వాహనమిత్ర'తో పాటు ఇంకా పలు పథకాల ద్వారా మేము ఎంతో లబ్ధి పొందాం. గతంలో ఏ ప్రభుత్వమూ ఆటో కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదు. జగనన్న మాకు సాయం చేశాడు. ఆయనకు ఓటు ద్వారా మా తరపున కృతజ్ఞత చెబుతాం.
–ఎస్.ఆరీఫుల్లా,తలుపుల

అర్హతే ప్రామాణికం



రేషన్ కార్డుతో పాటు లైసెన్స్ కలిగి ఆటో ఉన్న ప్రతి ఒక్కరినీ వాహన మిత్ర పథకానికి ఎంపిక చేశాం. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించాం. ఈ మేరకు ప్రచారం కూడా నిర్వహించాం. ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లకు ఇది మంచి పథకం.
– వరప్రసాద్, ఎంవీఐ, కదిరి

గీత దాటితే వేటు తప్పదు!



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

- ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి
- కోడ్ అమల్లోకి వస్తే అందరూ ఈసీ పరిధిలోకి వస్తారు
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు
- సమీక్షలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు పనిచేయాల్సి ఉంటుందని, ఏ ఒక్కరు నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఎన్నికల అధికారులతో వారు సమీక్షించారు. ఇబ్బందికరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలు, క్లెయిమ్‌ల పరిష్కారం, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల విధులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి అధికారులు, సిబ్బంది అంతా ఎన్నికల సంఘం ఆధీనంలో పని చేస్తారన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈసీ ఇచ్చిన హ్యాండ్ బుక్‌లోని అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,561 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని పెరిగితే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ 1,500 ఓట్లు ఉండాలన్నారు. ఓటరు సవరణ కార్యక్రమంలో వచ్చిన ఫారం 6, 7, 8లో క్లెయిమ్‌లను ఈనెల 29వ తేదీ లోపు పరిష్కరించాలన్నారు. ఫారం–7 (ఓటరు తొలగింపు) క్లెయిమ్‌ల పరిష్కారంలో రికార్డులు పరిశీలించి, జిల్లా ఎన్నికల అధికారి ఆమోదంతో ఓటు తొలగించాలని ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గ ఎన్నికల అధికారులను ఆదేశించారు. జిల్లా సరిహద్దుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను తనిఖీ చేయాలన్నారు. అధికారులు ఆయా అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గాలలోని పోలింగ్ కేంద్రాలను రూట్‌ల వారీగా సందర్శించాలన్నారు. అందులో మౌలిక వసతులను గుర్తించి నివేదించాలన్నారు. ఎన్నికల ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రి తరలించే క్రమంలో రహదారులు, వాహన రాకపోకలు, ముందస్తుగా గుర్తించి తగు చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

390 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో 390 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. పోలింగ్ రోజున ప్రతి సంఘటననూ వీడియో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కమిషన్ నుంచి వచ్చే ఆదేశాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని అమలు చేయాలన్నారు. సమావేశంలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకట శివరామిరెడ్డి, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసులు, శ్రీలత, కంజాక్షన్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- మార్చి 1 నుంచి 29 వరకూ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 22,514 మంది ఇంటర్ విద్యార్థులు
- 41 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు యంత్రాంగం చర్యలు

ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

	బాలురు	బాలికలు	మొత్తం
మొదటి సంవత్సరం	4,569	5,586	10,155
రెండో సంవత్సరం	4,254	5,414	9,668
ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన విద్యార్థులు ఇలా..			
మొదటి సంవత్సరం	673	700	1,373
రెండో సంవత్సరం	620	698	1,318

షెడ్యూల్ ప్రకారం ఇంటర్మీడియట్ -2024 పరీక్షల తేదీలు ఇలా...

తేదీ	మొదటి సంవత్సరం	తేదీ	సెకండ్ ఇయర్
01-03-2024	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-I	02-03-24	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-II
04-03-2024	ఇంగ్లీష్ పేపర్-I	05-03-24	ఇంగ్లీష్ పేపర్ - II
06-03-2024	మ్యాథమేటిక్స్ బోటనీ, సివిక్స్ పేపర్-Iఏ	07-03-24	మ్యాథమేటిక్స్ బోటనీ, సివిక్స్ పేపర్ -IIఏ
09-03-2024	మ్యాథమెటిక్స్ జువాలజీ, హిస్టరీ పేపర్-Iబీ	11-03-24	మ్యాథమెటిక్స్ జువాలజీ, హిస్టరీ పేపర్-IIబీ
12-03-2024	ఫిజిక్స్/ఎకనామిక్స్‌పేపర్-I	13-03-24	ఫిజిక్స్/ఎకనామిక్స్‌పేపర్-II
14-03-2024	కెమిస్ట్రీ/కామర్స్/సోషియాలజీ ఫైన్ ఆర్ట్స్ పేపర్-I	15-03-24	కెమిస్ట్రీ/ కామర్స్ ఫైన్‌ఆర్ట్స్ పేపర్ -II
16-03-204	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/లాజిక్ బ్రిడ్జ్ కోర్సు/మ్యాథ్స్ పేపర్- I	18-03-24	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/లాజిక్ బ్రిడ్జ్‌కోర్సు మాథ్స్‌పేపర్-II
19-03-2024	మోడరన్ లాంగ్వేజ్ జాగ్రఫీ పేపర్-I	20-03-24	మోడరన్ లాంగ్వేజ్ జాగ్రఫీ పేపర్ -II

పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు మార్చి 1వ తేదీ (శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 20వ తేదీ వరకూ జరగనున్నాయి. ఇందుకోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరగనున్నాయి. జిల్లా నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 22,514 మంది పరీక్షలకు హాజరుకానుండగా, అధికారులు 41 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల హాజరు ఆన్‌లైన్ ద్వారా తీసుకోనున్నారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రంలోనూ ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు తదితర సౌకర్యాలన్నీ కల్పించారు. 21 పోలీస్ స్టేషన్లలో పరీక్షా పత్రాలను భద్రపరిచారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు

గతంలో కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధించేవి. ఇలాంటి ఘటనలపై ఫిర్యాదులు అందడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ఆగడాలకు చెక్ పెట్టింది. విద్యార్థుల హాల్ టికెట్‌లను ఇంటర్‌బోర్డు పబ్లిక్ డొమైన్‌లో ఉంచింది. అలాగే ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్‌కు పంపింది. లేదంటే విద్యార్థులు నేరుగా https://bieap.apcfss.in వెబ్‌సైట్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం



ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షా హాలులో తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా స్క్వాడ్స్‌ను నియమించాం. విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
– రఘునాథరెడ్డి, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి

వేంకటరమణుడికి సూర్యాభిషేకం





పేటవేంకట రమణ స్వామి ఆలయంలోకి ప్రసరించిన సూర్యకిరణాలు (ఇన్‌సెట్‌లో) మూల విరాట్ నుదుటను తాకిన దృశ్యం

హిందూపురం: స్థానిక పేట వెంకటరమణ స్వామి ఆలయంలో అద్భుతం చోటు చేసుకుంది. మంగళవారం సూర్యకిరణాలు ఆలయ రాజ గోపురాన్ని దాటి స్వామి విగ్రహాన్ని తాకాయి. ఏటా మాఘమాసం వార్షిక బ్రహ్మోత్సవాల తర్వాత ఇలా జరుగుతుందని ఆలయ అర్చకులు చెబుతున్నారు. పేట వేంకటరమణ స్వామి మూలవిరాట్‌కు సూర్య భగవానుడే తన కిరణాలతో అభిషేకం చేసినట్లు ఉందని భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



తాడిమర్రి పోలింగ్ బూత్‌లో వసతులపై మండల అధికారులను ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

ధర్మవరం అర్బన్/బత్తలపల్లి/తాడిమర్రి: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులన్నీ కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో పర్యటించారు. ధర్మవరం పట్టణంలోని శాంతి నగర్, గూడ్స్‌షెడ్‌కొట్టాల, సంజయ్‌నగర్‌లోని పోలింగ్ బూత్‌లను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఉన్నాయా లేదా అని తనిఖీ చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్లకు అనుకూలంగా ఉండేలా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మార్కెట్‌యార్డులోని ఎన్నికల సామగ్రి గోడౌన్‌ను పరిశీలించారు. డబుల్ ఓట్లు, మృతి చెందిన వారి ఓట్లు, బోగస్ ఓట్లను ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్ల ద్వారా విచారణ చేయించి తొలగించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, కమిషనర్ రామ్‌కుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వరయ్య, డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వో యోగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు కలెక్టర్ తాడిమర్రిలోని 22, 23 పోలింగ్ కేంద్రాలను, బత్తలపల్లి మండలంలోని మాల్యవంతం గ్రామంలో గల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యుత్, ఫర్నీచర్, తాగునీటి వసతి, ర్యాంపులు, మరుగుదొడ్లు తదితర వసతులపై ఆరా తీశారు. ఇంకా ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలుంటే రాజకీయ పార్టీల నాయకులు వాటికి సంబంధించిన వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆయా మండలాల తహసీల్దార్లు నజ్మాబాబు, ఈశ్వరయ్య, ఎంపీడీఓ మణిమంజిరి, ఎంఈఓ కృష్ణమోహన్, ఎస్ఐలు నాగస్వామి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బస్టాండ్‌లో కర్ణాటక వాసి మృతి

పుట్టపర్తి టౌన్: కర్ణాటక ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని యాదగిరి పట్టణానికి చెందిన సురేష్ (33)రెండు రోజుల క్రితం చికిత్స కోసం సత్యసాయి జనరల్ ఆస్పత్రికి వచ్చారు. మంగళవారం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని చెట్టుకిందకు చేరుకోగానే కడుపు నొప్పి అంటూ కుప్పకూలాడు. స్థానికులు సహాయక చర్యలు చేపట్టేలోపు ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న సీఐ కొండారెడ్డి, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన గుర్తింపు కార్డుల ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

బత్తలపల్లి: పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను అపహరించుకెళుతున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఆరోహణ రావు, ఎస్‌ఐ శ్రీనివాసులు వెల్లడించారు. ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న ద్విచక్ర వాహనాల అపహరణ కేసుల దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా విడిపోయి విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నల్లమాడ మండలం సానేవారిపల్లికి చెందిన చియ్యేటి కుమార్‌ను అనుమానితుడిగా అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో పలు ద్విచక్రవాహనాల అపహరణ వెలుగులోకి వచ్చింది. రూ.4 లక్షలు విలువ చేసే ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

మడుగుతండాలో నాకాబందీ

తలుపుల: మండలంలోని మడుగుతండాలో ఎస్‌ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం నాకాబందీ చేపట్టారు. పలు ఇళ్లలో చేపట్టిన తనిఖీల్లో బుక్యా రమణ నాయక్ ఇంట్లో 20 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

హోంగార్డుపై దాడి

కదిరి టౌన్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్ రామచంద్రపై నిజామ్‌వలి కాలనీకి చెందిన యువకుడు భార్గవ్ దాడి చేశాడు. మంగళవారం రాత్రి జీవిమాను సర్కిల్ నుంచి మదనపల్లి వైపు ఆటోలో వెళుతున్న భార్గవ్ రోడ్డుపై వాహనాన్ని నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ముందుకు వెళ్లాలని అక్కడే విధుల్లో ఉన్న హోంగార్డు రామచంద్ర సూచించాడు. ఆ సమయంలో వాగ్వాదానికి దిగిన భార్గవ్ ఆటో దిగి తక్కెడతో దాడి చేశాడు. ఘటనలో హోంగార్డు చెయ్యి విరిగింది. రామచంద్ర ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ బాబ్జాన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తాడిపత్రికి బ్రహ్మోత్సవ శోభ

- 3 నుంచి బుగ్గ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- 13వ తేదీ వరకూ విశేష వాహన సేవలు
- చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు


అలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు


విశేష అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి


బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం


భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైన్లు, చలువ పందిళ్లు

తాడిపత్రి అర్బన్: దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేకతను సంపాదించుకున్న తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. దీంతో తాడిపత్రిలో బ్రహ్మోత్సవ శోభ ఉట్టిపడుతోంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఏటా మాఘ బహుళ అష్టమి నుంచి ఫాల్గుణ శుద్ధ తదియ వరకూ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఉత్సవాలు ఇలా...

మార్చి 3న సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. 4న సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి చిత్ర గోపుర గ్రామోత్సవం, 5న ఉదయం వాసుకీ వాహనం, రాత్రికి శేషవాహనం, 6న సింహవాహనం, 7న నరమృగ వాహనం, 8న శుక్రవారం త్రయోదశి మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నంది వాహనం, రాత్రి అధికార నంది వాహనం, రాత్రి 11 గంటలకు శివజ్యోతి దర్శనం, రాత్రి 12గంటలకు లింగోద్భవం, 9న గజ వాహనం, 10వ తేదీ ఆదివారం అమావాస్య రోజున ఉదయం 9గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, మధ్యాహ్నం 2గంటలకు మహారథోత్సవం, 11న రాత్రి అశ్వవాహనం, 12న వసంతోత్సవం, హంసవాహనం, 13న ఏకాంత్సోవ సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

దక్షిణ కాశీగా ఖ్యాతి

పెన్నానది ఒడ్డున వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం ఎన్నో ప్రత్యేకతలకు నెలవుగా భాసిల్లుతోంది. ఆలయం పక్కనే ప్రవహిస్తున్న పెన్నానది ఉత్తర వాహినిగా ఉండడం గమనార్హం. కాశీలోనూ గంగా నది ఉత్తర వాహినిగా ఉంటోంది. కాశీలో విశ్వనాథుడి ఆలయం పక్కనే శ్మశాన వాటిక ఉన్న రీతిలోనే బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం పక్కన ఉండడం విశేషం. ఆలయంలో బుగ్గరామలింగేశ్వరుడు దక్షిణాభిముఖంగా వెలసి ఉన్నాడు. దీంతో ఈ ఆలయాన్ని దక్షిణ కాశీగా పిలుస్తుంటారు. త్రేతాయుగంలో యాగ పరిరక్షణలో భాగంగా తాటకిని సంహరించిన అనంతరం స్త్రీ హత్య దోష నివారణకు అప్పటికే స్వయంభూ గా వెలసిన బుగ్గరామలింగేశ్వరుడికి రామలక్ష్మణులతో విశ్వామిత్రుడు విశేష పూజలు చేయించినట్లు ఇతిహాసం చెబుతోంది. లింగోద్భవ స్థానంలో బుగ్గ నుంచి నిరంతరం నీరు ఉబికి వస్తుండడం ఈ ఆలయంలోని మరో విశేషం.

మహా శివరాత్రి రోజున లింగోద్భవం, జ్యోతి దర్శనం

మహా శివరాత్రి పర్వదినాన రాత్రి 11 గంటలకు లింగోద్భవ కాలమందు జ్యోతి దర్శనం ఉంటుంది. రాత్రి 12 గంటలకు లింగోద్భవ దర్శనాన్ని ప్రతి ఒక్కరూ దర్శించుకునేలా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఎల్‌ఈడీ టీవీలను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాటు చేస్తున్నారు.

ఆలయానికి ప్రత్యేకత ఉంది



ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. బుగ్గ రామలింగేశ్వరుడు దక్షిణాభిముఖంగా వెలసి ఉన్నాడు. ఈ ఆలయాన్ని జనమేజయ మహారాజు కట్టించినట్లుగా చరిత్ర చెబుతోంది. ఆ సమయంలోనే మహారాజు సైతం మరో శివలింగాన్ని దక్షిణ దిశలో ప్రతిష్టించి వెళ్లారు. పురాతన చరిత్రకు, విశిష్టతకు సాక్షిగా నిలిచిన ఈ ఆలయం పెన్నానది ఒడ్డున ప్రశాంత వాతావరణంలో ఉంది. బుగ్గ రామలింగేశ్వరుడిని పూజిస్తే సకల దోషాలు హరిస్తాయని ఇతిహాసాలు చెబుతున్నాయి.

– ఎం.చంద్రశేఖరశర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

సర్వదర్శనానికే అధిక ప్రాధాన్యం

సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వామి దర్శన ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలైన్లు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం.

– పోలిశెట్టి ఆంజనేయులు, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు

పోలీసు శాఖకు మంచి పేరు తేవాలి

- హోంగార్డులకు సూచించిన కమాండెంట్ మహేష్ కుమార్


విధుల్లో ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్


హోంగార్డులకు శిక్షణ ఇస్తున్న కమాండెంట్

పుట్టపర్తి టౌన్: హోంగార్డులు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచి పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పోలీస్ పరేడ్ మైదానంలో పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలోని హోంగార్డుల విజిటింగ్, పరేడ్ నిర్వహించారు. విధి నిర్వహణలో నైపుణ్యం, బందోబస్తు, ట్రాఫిక్ విధులపై అధికారులు దిశానిర్దేశం చేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మరింత మెరుగ్గా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న వారే సక్రమంగా విధులు నిర్వర్తించగలరని, ఈ విషయాన్ని గుర్తించి అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. పోలీస్ శాఖలో హోంగార్డుల పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐ చంద్రశేఖర్, ఏఎస్‌ఐ శ్రీరాములుతోపాటు హోంగార్డులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళుతూ మృత్యు ఒడికి...

చిలమత్తూరు: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరుకు చెందిన ఆదినారాయణప్ప (62) మరువకొత్తపల్లి బీసీ కాలనీ వద్ద ఉన్న ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుంటుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఘటనలో తలకు తీవ్ర గాయమై ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. 14 ఏళ్ల బాలుడితో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా నగేష్


ఎం.నగేష్

అనంతపురం అగ్రికల్చర్: మత్స్యకార సహకార సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన ఎం.నగేష్ ఎన్నికయ్యారు. హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో ఎన్నికల అధికారి ఫక్కీరప్ప ఆధ్వర్యంలో ప్రక్రియ నిర్వహించారు. అధ్యక్ష స్థానంతో పాటు ఉపాధ్యక్షుడిగా శింగనమలకు చెందిన బెస్త వెంకటనారాయణతో పాటు మరో 9 మంది డైరెక్టర్లను ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. మొత్తం 11 మందితో ఏర్పడిన జిల్లా నూతన కమిటీ కాల వ్యవధి ఐదేళ్లు ఉంటుందని ఎన్నికల అధికారి, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ) డి.ఫక్కీరప్ప తెలిపారు. 75 మంది సొసైటీ అధ్యక్షులకు ఓటు హక్కు ఉండగా 58 మంది హాజరయ్యారు. 11 డైరెక్టర్ పోస్టులకు 15 మంది నామినేషన్లు వేసినా... ఉపసంహరణ ప్రక్రియలో నలుగురు విత్‌డ్రా చేసుకున్నారు. చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక అవసరం లేకుండా పాలక వర్గం ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్మన్ పాటు డైరెక్టర్లుగా ఎంపికైన బి.రాజకుమార్, బి.గోవిందప్ప, టి.వెంకటేష్, ఎస్‌కే శ్రీనానాయక్, ఎం.బాలక్రిష్ణ, టి.రామక్రిష్ణ, రాజేష్‌నాయక్, బి.సూర్యనారాయణ, టి.సూర్యనారాయణ తదితరులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాసనాయక్, ఎఫ్‌డీఓలు ఆసిఫ్, లక్ష్మీనారాయణ, బాబునాయక్, వీఎఫ్‌ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. నూతన పాలక వర్గానికి, చైర్మన్ ఎం.నగేష్‌కు సొసైటీ అధ్యక్షులు, సభ్యులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సుధామృత కోర్సు సర్టిఫికెట్ల ప్రదానం




సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు, చక్రవర్తి, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి బోధనల మేరకు మనిషిలో సద్గుణాలు, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేందుకు సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రూపొందించిన సత్యసాయి వాహిని సుధామృత కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను మంగళవారం ప్రదానం చేశారు. సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 9 నెలల నిడివి గల ఈ కోర్సును సత్యసాయి సేవా సంస్థలు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి 6 భాషలలో అందిస్తున్నారు. ఈ సందర్భంగా సత్యసాయిని కీర్తిస్తూ భక్తులు నిర్వహించిన సంగీత కచేరి అలరించింది.

ఇష్టం లేని పెళ్లి - నవవరుడి ఆత్మహత్య

చిలమత్తూరు: ఇష్టంలేని పెళ్లి చేయడంతో మనస్తాపం చెందిన నవవరుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం కోడూరుకు చెందిన ప్రసాద్ (29)కు రెండు నెలల క్రితం పెళ్లి అయింది. తనకు ఇష్టం లేని పెళ్లి చేశారంటూ పలు సందర్భాల్లో నవవరుడు కుటుంబసభ్యులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం సుబ్బరావుపేట సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు డాక్టర్లు, నర్సుపై వేటు

పావగడ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రసూతి కేంద్రంలో వివిధ కారణాలతో శస్త్ర చికిత్స చేయించుకున్న అంజలి, అనిత, నరసమ్మ మృతి చెందిన ఘటనకు సంబంధించి గైనకాలజిస్ట్ డాక్టర్ పూజ, ఓటీ ఇన్‌చార్జ్ డాక్టర్ కిరణ్, స్టాఫ్ నర్స్ పద్మావతిని సస్పెండ్ చేస్తూ మంగళవారం హోమ్ మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆదేశాలు రాక మునుపే ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఐదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న గైనకాలజిస్ట్ డాక్టర్ పూజ తన విధులకు రాజీనామా చేయడం గమనార్హం. అలాగే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఆస్పత్రి పాలనాధికారి, చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ కిరణ్‌ను వైఎన్ హొసకోట ఆస్పత్రికి బదిలీ చేశారు. కాగా, మృతుల కుటుంబాలను స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప పరామర్శించి, ఓదార్చారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత


చెక్కు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఈ నెల 6న మేడాపురం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో మరణించిన హోంగార్డు నాగప్ప కుటుంబానికి ఎస్పీ మాధవరెడ్డి అండగా నిలిచారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మంజూరైన రూ.20 వేలను చెక్కు రూపంలో నాగప్ప భార్య ఉదయకు మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఏ సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. శాఖాపరంగా అందాల్సిన ప్రయోజనాలు త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ శ్రీరాములు, సిబ్బంది రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎన్నికల నిఘా వేదిక సంఘానికి సహకరిస్తాం

ఎన్నికల నిఘా వేదిక సంఘం సభ్యులకు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన ఎన్నికల నిఘా వేదిక సభ్యులు మంగళవారం ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు సజావుగా జరిగేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం నిఘా వేదిక పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉభయ జిల్లాల కో-ఆర్డినేటర్ షేక్ నబీరసూల్, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పామిడి ఆర్‌ఐ


ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన ఆర్‌ఐ క్రాంతికుమార్ (కూర్చొన్న వ్యక్తి)

పామిడి: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) శ్రవణం క్రాంతికుమార్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) గాలానికి చిక్కారు. మ్యుటేషన్ కోసం రైతుల నుంచి రూ.6 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల కథనం మేరకు.. పామిడి మండలం అనుంపల్లికి చెందిన రైతు కె.శేషాద్రి కొన్ని రోజుల క్రితం గ్రామ సర్వేనెంబర్లు 340, 341లోని దాదాపు ఏడెకరాల భూమిని తన భార్య కె.జయలక్ష్మి, తమ్ముడు సుంకయ్య భార్య కె.గంగేశ్వరమ్మ పేర చెరి సగం చొప్పున మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేశారు. ఇందుకు ఆర్‌ఐ శ్రవణం క్రాంతికుమార్ ఆ ఇరువురి పేర మ్యుటేషన్ చేయడానికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రూ.3 వేల చొప్పున మొత్తం రూ.6 వేలకు డీల్ కుదిరింది. అయితే.. లంచం ఇవ్వడానికి ఇష్టపడని శేషాద్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే ఏసీబీ అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకట్రాది ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రైతు శేషాద్రిని ఆర్‌ఐ వద్దకు పంపారు. శేషాద్రి నుంచి క్రాంతికుమార్ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నరసింహ నాయుడు (ఫైల్)

ముదిగుబ్బ: మండలంలోని నాగులగుబ్బకు చెందిన నరసింహనాయుడు(22) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆదివారం దొరిగిల్లు రోడ్డులోని బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో నరసింహనాయుడుతో పాటు ఆయన తండ్రి నరసింహులూ తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింహనాయుడు పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నకిలీ బిల్లులతో అక్రమ రవాణా

హిందూపురం అర్బన్: లారీ యజమానుల కళ్లు కప్పి నకిలీ వే బిల్లులు అంటగడుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకుల గుట్టు రట్టయింది. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో ఈ విషయం వెలుగు చూసింది. రాళ్లు, కంకర, మట్టి ఏదైనా ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేసే అంశంలో ప్రభుత్వానికి రాయల్టీ తప్పనిసరిగా చెల్లించాలని నిబంధనలు ఉన్నాయి. మొత్తం ఈ ప్రక్రియను పక్కాగా నిర్వహించే బాధ్యతను ఓ ప్రైవేట్ కంపెనీ తీసుకుంది. ఈ క్రమంలో కంపెనీ నిర్వాహకులు జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు, ప్రధాన కూడళ్లలో సిబ్బందిని ఏర్పాటు చేసి రాళ్లు, కంకర, గ్రానైట్ తదితరాలు తరలిస్తున్న లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపాల్సి ఉంది. సోమవారం విజిలెన్స్ అధికారులు సాయి ప్రసాద్, ఫణీంద్ర కొడికొండ చెక్‌పోస్టు, లేపాక్షిలో లారీలను తనిఖీలు చేయగా నకిలీ వే బిల్లులు బయటపడ్డాయి. దీంతో లేపాక్షిలో 3, చెక్‌పోస్టు వద్ద మరో మూడు లారీలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా లారీల యజమానులు మాట్లాడుతూ.. తాము రాయల్టీ చెల్లించే సరుకు రవాణా చేస్తున్నామని, అయితే తమకు ఇచ్చిన రసీదులు అసలైనవా? కాదా? అనేది సరిచూసుకోలేక పోయామని వివరించారు. దీంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి విజిలెన్స్ అధికారులు తీసుకెళ్లారు.

'పురం' బాడీబిల్డర్లకు పతకాలు


పతకాలు సాధించిన హిందూపురం యువత

హిందూపురం: ఈ నెల 25న వైఎస్సార్ జిల్లా కడప కేంద్రంగా జరిగిన మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీల్లో హిందూపురానికి చెందిన బాడీ బిల్డర్లు వివిధ పతకాలు దక్కించుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 260 మంది పోటీ పడగా... ఇందులో హిందూపురానికి చెందిన 8 మంది యువకులు ఉన్నారు. 65 కిలోల విభాగంలో నవీద్‌కు కాంస్య పతకం దక్కింది. 80 కిలోల విభాగంలో ఆకిబ్‌కు కాంస్యం, 55 కిలోల విభాగంలో తబ్రేజ్‌కు రజత పతకం సాధించారు. అలాగే దివ్యాంగుల విభాగంలో సద్దామ్‌కు రజత పతకం దక్కింది.

గంజాయి పట్టివేత

ఎన్‌పీ కుంట: మండల కేంద్రం సమీపంలోని కొత్త రోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి రెడ్డి బాషా, ఇమ్రాన్ అనే ఇద్దరు యువకులు ఒక కిలో గంజాయిని విక్రయించేందుకు తీసుకువస్తూ పట్టుబడ్డారని తెలిపారు. గంజాయితో పాటు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత


సీజ్ చేసిన వాహనాన్ని చూపుతున్న అధికారులు

కనగానపల్లి: మండలంలోని తగరకుంట సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం తగరకుంట సమీపంలో డిప్యూటీ తహసీల్దార్ కవితతో కలసి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనంలో 80 ప్యాకెట్లలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ సాయినాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు రామాంజప్ప

మడకశిర రూరల్: కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ పాదచారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మడకశిరలోని ఎస్సీ కాలనీకి చెందిన రామాంజప్ప (45) మంగళవారం రాత్రి చంద్రబావి నుంచి రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా యు.రంగాపురం సమీపంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో రామాంజప్ప అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్యాపిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.